Satyam

మరుగుపడిన జీవన రాగాలు



కుమారి
మంగు పద్మావతి

జీవితంలో చిత్రవిచిత్ర మైన సంఘటన లెన్నో జరుగుతూ వుంటాయి. కొన్ని మనస్సులో పీఠం వేసుకుని శాశ్వతంగా వుండిపోతాయి. కొన్ని మనం మరచిపోయినా జీవితరాగంలో ఎప్పుడో ఎక్కడో ఒకసారి విచిత్రంగా గుర్తుకు వస్తాయి.

అనూరాధ తన జీవితంలో మాధవ్ బావను చూస్తుం దనిగాని, అతని ప్రక్క చిన్ననాటి స్నేహితురాలు లలిత కనిపిస్తుందని గాని కలలోకూడ అనుకోలేదు.

ఆకాశంమీద మబ్బులు గుంపు గుంపులుగా క్రమ్ముకొంటున్నాయి. గాలి రివ్వున వీస్తోంది. తుప్పర ప్రారంభ మైంది. మూడవ తరగతి "స్లీపరులో" కూర్చుని కిటికీలోనుండి

కుశలప్రశ్నలయిన తరువాత మాధవరావు అన్నాడు, "స్నేహితుడు కుటుంబంతో కలకత్తా వెళుతున్నాడు. వారిని సాగనంపడానికి వచ్చాము. నువ్వు కంపార్ట్మెంటు ఎక్కుతూవుంటే లలితచూసి చెప్పింది. ముందుగా ఉత్తరం వ్రాయలేక పోయావా రాధీ!"

"బావుంది. మీరు ఇక్కడ వున్నట్టు నాకేం తెలుసు? అయినా మీకు నేను గుర్తున్నానా? ఎన్ని ఉత్తరాలు వ్రాసాను. ఒక్కదానికి జవాబు వ్రాసారూ?" నిష్ఠూరంగా అంది అనూరాధ.

"క్షమించు రాధీ! అప్పట్లో నేను ఓ పిచ్చివాడిగా తిరుగుతూ వుండే వాణ్ని" అన్నాడు మాధవ్ బాధగా.

అప్పటికి గాని తట్టలేదు "బావ ప్రేమించి పెళ్ళి చేసుకున్న సరళ ఏమైంది?" అన్న ఆలోచనతో ఒక్క నిముషం మౌనంగా వుండిపోయింది అనూరాధ.

"ఏమిటి రాధ ఆలోచిస్తున్నావు?" అన్నారు ఇద్దరూను.

"ఏం లేదు" అంది ముక్తసరిగా రాధ.

"నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసును రాధ! ఆ గాథ ఇక్కడ చెప్పడం భావ్యం కాదనుకుంటాను" అన్నాడు మాధవరావు.

"అవును రాధీ. ఆ యన న్నది బాగానే వుంది. నీకు వివరంగా వ్రాస్తాను సరేనా?" చిరునవ్వు నవ్వుతూ అంది లలిత. ఆ చిరునవ్వు వెనకాల బాధ! అగాధమైన జలపాతంలా కన్నీరు దాగివుందన్న సంగతి అనూరాధకి ఏం తెలుసు?

అనూరాధ చిరునవ్వు నవ్వుతూ "నీ జీవితంలో చీకటి అంతరించినందుకు సంతోషంగా వుంది — 'వచ్చే జన్మలోనైనా మాధవ్‌ను భర్తగా పొందగలిగే అదృష్టం వుంటే చాలు రాధీ' అన్నావు గుర్తుందా లల్లీ? ఈ జన్మలోనే చేపట్టగలిగావు. చాల అదృష్ట వంతురాలివి లలితా!" అంది.

"అవును రాధీ! నువ్వన్నట్టు నేను అదృష్టవంతురాలిని. జన్మ జన్మాలకూ ఆయనే భర్తగా వుండాలని కోరుతూ వుంటాను" మాధవరావు వైపు చూస్తూ చిరునవ్వు నవ్వింది లలిత.

ఆ చిరునవ్వులో ఆనందం వెల్లి విరుస్తూ కోటిసూర్యుల వెలుగు ప్రజ్వరిల్లుతున్నట్లు కనిపించింది అనూరాధకు.

"అదృష్ట వంతుణ్ని నేనూ రాధ!" అన్నాడు మాధవరావు.

"అవును మాధవ్! లలితవంటి ఉత్తమురాలు నీకు భార్యగా ఈ జన్మలో అవడం, నీ అదృష్టమనే అనాలి. మీ రిద్దరికిద్దరూ అదృష్టవంతులు.

మీ ఇద్దరినీ ఒకదగ్గరగా చూడ్డం నా అదృష్టం కదూ ?'' అంది రాధ ముగ్గురూ నవ్వుకున్నారు. ఆ కొద్ది సేపట్లోనే తమ చిన్ననాటి సంగతులు జ్ఞప్తికి తెచ్చుకుని సరదాగా గడిపేశారు.

యింజను ఒక్క కేకతో వచ్చి ట్రైన్ని కలుసుకుంది. విడిపోయే సమయం వచ్చింది. అందరి హృదయాలూ భారంగా వున్నాయి.

మొదటి గంట కొట్టారు. మాధవరావు బాబును దగ్గరకు తీసుకుని మృదువుగా చెక్కిలి మీద ముద్దు పెట్టుకున్నాడు. లలిత తన మెడలోనున్న సన్నటి లాకెట్‌తో నున్న గొలుసును బాబు మెడకి తగిలించింది.

అనూరాధ ఆ దృశ్యం చూసిందే గాని వారించలేకపోయింది. బాబును అనూరాధ తీసుకుంది. మాధవరావూ, లలితా క్రిందకు దిగారు. అనూరాధ నడిగి ఎడ్రస్సు వ్రాసుకుని తన ఎడ్రస్సు వ్రాసి అనూరాధ చేతికి అందించాడు మాధవరావు.

''రాధీ ! బాబు పేరు ?'' అడిగింది లలిత.

''మాధవరావు'' అప్రయత్నంగా అనూరాధ నోటి నుండి వచ్చింది. తన మాటకు మాధవరావు కళ్ళు ఆనందంతో మిళమిళ మెరవడం చూసి సంతృప్తిగా నిట్టూర్చింది రాధ !

''రాధీ ! చేరగానే ఉత్తరం వ్రాస్తావు కదూ ! నువ్వు బావగారితో కలసి రావాలి సుమా !'' గాద్గదికంగా అంది లలిత.

''తప్పక వస్తాము లలితా !'' లలిత చెయ్యి మృదువుగా నొక్కుతూ అంది రాధ !

గార్డు పచ్చజండా ఊపుతున్నాడు యింజను ప్రియుడు వదిలిన ప్రియురాలులా భారంగా కదిలింది.

ట్రైను స్పీడు అందుకుంది. తన చేతిలో నున్న లలిత చెయ్యిని జారవిడిచింది. ఒకరి నొకరు చేతులు వూపుకుంటూ విడిపోయారు.

అనూరాధ హృదయం ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతోంది. తను కలలోకూడ అనుకోలేదు మాధవ్ లలిత ఒక్కటిగా కలుస్తారని. జరిగిన సంఘటనలన్నీ ఒక్కసారిగా కళ్ళ ముందు మెరిసాయి అనూరాధకు.

బరువుగా, కను రెప్పలు మూతబడ్డాయి.

* * *

అదో చిన్న గ్రామం. రాఘవయ్య, ఆ గ్రామమునసబు. పార్వతమ్మ రాఘవయ్య భార్య. మాధవుడు రాఘవయ్య చెల్లెలు కొడుకు. చెల్లెలూ, ఆమె భర్తా అకాలమృత్యువు వాతపడడంవల్ల మేనల్లుణ్ణి చేరదీసాడు రాఘవయ్య. అతని భార్య పార్వతమ్మ మాధవుడిని

కన్న కొడుకుగా ఎంతో ప్రేమతో చూచుకొనేవారు. వారికి అప్పటికి సంతానం కలుగలేదు.

"ఏవమ్మా పార్వతమ్మా! అల్లుడ్ని చేరదీస్తున్నావు బాగానే వుంది. ఓ కూతురిని కనివేస్తూ" అనే వారు ఇరుగూ పొరుగూను.

పార్వతమ్మ నవ్వేసి "నాకు వీడు చాలమ్మా. కూతురు, అల్లుడు, కొడుకు వీడే" అంటూ దగ్గరున్న మాధవుడిని ప్రేమతో తల నిమిరేది.

"ఓ యబ్బ! మహా కనేసినట్టే పెంచుతున్నావు" అని వారంటే "కన్న ప్రేమ కన్నా, పెంచిన ప్రేమ గొప్పదంటారు" అనేది పార్వతమ్మ.

మూడేళ్ళకి పార్వతమ్మ కన్న ప్రేమకూడ చవిగొన్నది. అనూరాధ అని పేరు పెట్టారు మనమరాలకి. దుర్గమ్మగారు మాధవుడితో "ఒరేయి, నీ పెళ్ళంరా" అని అంటే "ఉహు, కాదు చిన్నిచెల్లాయి" అనేవాడు మాధవుడు.

అనూరాధకు ఐదేళ్ళు వచ్చేవరకూ మాధవుడి బుజం మీదే వుండేది. రాధ అంటే మాధవుడికి ప్రాణం. ముద్దుగా 'రాధీ!' అని పిలిచేవాడు.

రాధ మాధవుడ్ని 'అన్నాయ్' అనేది. దుర్గమ్మగారు విన్నప్పుడల్లా రాధను మందలించి 'బావ' అని పిలిపించేది. రాధా మాధవులే కాక ప్రక్కింటివారి అమ్మాయి లలిత కూడ వీళ్ళతో కలసి మెలసి వుండేది. ముగ్గురూ ఎక్కడికి వెళ్ళినా జట్టుగా వెళ్ళేవారు. చిన్నతన మంతా పచ్చటి పొలాల దగ్గర, చెరువుగట్లమీద ఆటపాటల్లో గడిచి పోయింది.

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. కాలంతో పాటు ముగ్గురు స్నేహితులూకూడ పెరిగి పెద్దవా రయ్యారు. మాధవరావు పట్నంలో డిగ్రీ కోర్సు చదువుతున్నాడు. ఉన్న గ్రామంలోనే స్కూలు ఫైనలు పాసయి ఇంటి దగ్గరే గడుపుతున్నారు రాధా, లలితాను.

"ఆడపిల్లలకు ఇంతకన్నా ఎక్కువ చదువు అక్కరలేదు" అనే కోవకు చెందినవారు రాఘవయ్య దంపతులు. "ఎదిగిన పిల్లని స్కూలుకు పంపించడమే! హవ్వ" అని నోరు నొక్కుకునే వారు దుర్గమ్మగారు.

ఆ సంవత్సరంతో అయిపోతుంది మాధవరావు చదువు. ఈ నాలుగేళ్లలో మాధవ్ తన వూరు రెండు సార్లు వచ్చాడు. మాధవ్ దగ్గరికి వెళ్లాలంటే భయం, సిగ్గూ ముంచుకొచ్చేవి రాధకు. బావ ఎంతలా మారిపోయాడు? చాల అందంగాకూడ తయారయాడు. తను మాత్రం మారిపోలేదా? అందంగా తయారవలేదా? తనలో తాను ప్రశ్నించుకుని నవ్వు

కునేది అనూరాధ. మాధవరావు రాధకు తన కాలేజి సంగతులూ, పట్నంలోని వింతలు విశేషాలు చెప్పేవాడు. రాధ క్రమేపి భయం, సిగ్గూ పోయి, మాధవరావంటే, ప్రేమ, చనువు పర్పడింది. లలిత మొదట్లో మాధవునితో మాట్లాడడానికి సిగ్గుపడిందిగాని క్రమేపి లలితకూడ మాధవరావుకు అతిసన్నిహితురాలయింది. మాధవ్ లేనిదే తను బ్రతకలేననే అవస్థకు వచ్చింది. మాధవరావుకు తెలుసు. ఈ యిద్దరందగత్తెలు తనని ఆరాధిస్తున్నారని. అనూరాధమీద అమితమైన ప్రేమానురాగాలున్నాయి. అవి సోదర సోదరీలకున్న ప్రేమానురాగాలు. చిన్నప్పటినుండీ అదే అలవాటులో వున్న మాధవరావు పెద్దయిన తరువాతకూడ తన అభిప్రాయం మార్చుకోలేకపోయాడు. లలిత అందం అసమానమైనది. ఆమె సన్నిధానంలో అనిర్వచనీయమైన ఆనందం కలిగిస్తుంది మాధవరావుకు. ముగ్గురూ రోజూ షికారుకువెళ్లేవారు. తమ చిన్ననాటి ఆటపాటలు గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా నవ్వుకొనేవారు.

ఒకరోజు లలితను ఏకాంతంగా కలుసుకోవడం జరిగింది మాధవరావుకు.

"లలితా!" అన్నాడు ప్రేమపూరితమైన కంఠంతో.

"ఊ" అంటూ తన విశాల నయనాలతో మాధవరావు వైపు చూసి సిగ్గుతో తలవంచుకుంది లలిత.

"స్త్రీకి సిగ్గు, సింగార మన్నారు" నవ్వుతూ అన్నాడు మాధవ్.

"ఎవరన్నారుట?" చిలిపిగా ప్రశ్నించింది లలిత.

"ఎవరో మహాకవులు."

"పురుషులకు చిరునవ్వే అందం" అంది లలిత నవ్వుముఖంతో.

"ఎవరన్నారుట?" చిలిపిగా లలిత వైపుచూస్తూ ప్రశ్నించాడు మాధవ్.

"నేను" ఇద్దరు నవ్వేసారు.

అంతవరకూ వీరి మాటలు చాటుగా నిలబడి వింటున్న రాధ లేని నవ్వును బలవంతంగా తెచ్చిపెట్టుకుంటూ వీరి దగ్గరకి వచ్చింది. వీరి మాటలు తను పొంచివినాలని అక్కడ నిలబడలేదు. తను గదిలోకి వెళుతూ వుంటే 'లలితా'అని మాధవ్ గొంతుక వినబడింది. అంతే. అచేతనంగా నిలబడిపోయింది. కాని ఒక్కసంగతి మాత్రం అర్థమైంది. 'లలిత తన బావను గాఢంగా ప్రేమిస్తున్న'దని. ఈ సంగతి రాధ మనస్సులో మెదలగానే ఎవరో అగాధంలో త్రోసినట్టు బాధపడింది.



రాధ మౌనంగా నిలబడిపోవడం చూసి లలిత కొంచెం బాధపడింది.

మాధవ్ నవ్వుతూ పలుకరించాడు "ఏం రాధీ ! ఇంత ఆలస్యం చేశావు? చెరువు గట్టువైపు వెళదా మను కున్నాముకదూ ?''

"సారీ, బావా ! ఈ రోజు నేను రాలేను. తల నొప్పిగావుంది, మీరు వెళ్ళిరండి" అని మాధవరావుతో అని, "లలితా, నువ్వూ, బావా వెళ్లిరండి." అంది లలితతో.

''నువ్వు రాకపోతే నేనువెళ్ళను" అంది లలిత.

యేం ఎందుకు వెళ్ళవు? బావ నీకు కొత్తవాడా? వెళ్ళు లలితా! యివ్వాళ్ళకి మీరు వెళ్ళుదురూ. ఏం పరవాలేదు. వెళ్లిరండి బావా'' అనేసి సమాధానానికికూడ యెదురుచూడక వెళ్ళిపోయింది అనూరాధ.

అనూరాధ వెళ్ళిన తరువాత "రా లలితా ! మనం వెళదాం" అన్నాడు మాధవరావు.

''నాకు ఇంట్లో పనివుంది, మీరు వెళ్ళిరాకూడదూ" అంది లలిత మెల్లిగా.

మాధవరావు నవ్వుతూ, "మీ ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం బ్రహ్మ తరంకాదు. రా వెళదాం" అన్నాడు.

''క్షమించండి! రేపు వెళదాం! రాధ కూడ వస్తుంది'' మాధవ్ సమాధానం వినకుండా వెళ్ళిపోయింది లలిత.

మాధవరావు లలిత వెళ్ళే దిక్కే చూస్తూ అక్కడే ఒక్క క్షణం నిలబడి ఏదో నిర్ధారణ చేసుకున్న వాడిలా లోపలికి వచ్చాడు అనూరాధని వెతుక్కుంటూ.

రాధ డాబామీద, పిట్టగోడపైన కూర్చుని ఆలోచిస్తున్నది. 'మాధవ్ తనని ప్రేమించడం లేదా? బావ చదువు పూర్తి కాగానే తమిద్దరికీ వివాహం జరపాలని నిశ్చయించారు కదా. ఈ సంగతి బావకూ, లలితకూ తెలుసు. మరి వారి ఉద్దేశాలు ఏమిటి? తనని లలిత అగాధంలోకి తొయ్యాలని చూస్తోంది. ఎందుచేత? ఒకవేళ వారి చనువు తను అపార్థం చేసుకోవడం లేదుకదా?' పరిపరి విధాల ఆలోచిస్తూ లేని తలనొప్పి తెచ్చిపెట్టుకుంది అనూరాధ.

"రాధీ!" మెల్లిగా పిలిచాడు మాధవరావు.

"........"

"ఏమిటి రాధీ ఆ దీర్ఘాలోచన." అనూరాధ భుజంమీద చెయ్యి వేసి అన్నాడు మాధవరావు.

ఉలిక్కిపడిలేచినిలబడిందిఅనూరాధ.

''ఏం, రాధీ, తలనొప్పి తగ్గిందా?" అన్నాడు మాధవ్.

మౌనంగా అతనివైపు ఒక సారి చూసి క్రిందకి వెళ్ళబోయింది రాధ.

"రాధీ!" అంటూ చెయ్యిపట్టుకుని కూర్చోపెట్టేడు, తనుకూడా ప్రక్కనే కూర్చుంటూ ''రాధీ, నీకు కోపం వచ్చిందా?"

"లేదు" ముక్తసరిగా జవాబు చెప్పింది రాధ. "నా మాటలు నీవిప్పుడు వినే పరిస్థితిలో లేవు కానీ రాధీ! ఒక్క మాట చెప్పదలచాను, దయచేసి వింటావుకదూ!" అలా అంటున్నప్పుడు అతని కంఠం బాధగా మాట్లాడింది.

రాధ ఒక్క నిముషం వూరుకొని ''చెప్పు బావా! నీ మాట ఎప్పుడు వినలేదు చెప్పు!'' అంది.

"నాకు తెలుసు రాధీ! నీవు నాతో రాజీ ఔతావని" అన్నాడు నవ్వుతూ.

రాధ కూడా నవ్వలేకుండా వుండలేకపోయింది.

మాధవ్ చెప్పడం ప్రారంభించేడు!

''చూడు రాధీ! నిన్ను చిన్నప్పుడు ఎత్తుకు మోసేవాడిని. ఎంత అల్లరి చేసేదానివో తెలుసా?''

''తెలీదు'' అంది రాధ మాధవ్ కళ్ళల్లోకి చూస్తూ.

"అవును, నీ కెలా తెలుస్తుంది? నీవు చిన్నపిల్లవు" అన్నాడు.

''అది సరే గాని ఏమిటి చెప్ప దలచుకొన్నావో సూటిగా చెప్పు" అంది విసుగ్గా రాధ.

మాధవరావు అన్నాడు: "నేను చిన్నప్పటినుండి నిన్ను చెల్లెలుగా భావించుకుంటున్నాను.''

"ఇప్పుడో?" తీవ్రంగా అంది రాధ.

"ఎప్పుడూ అంతే రాధీ! నీవు నా చెల్లివి. జన్మ జన్మాలకైనా నిన్ను సోదరిగానే కోరుకుంటాను. ఈ జన్మలో కాకపోయినా వచ్చేజన్మలో నైనా ఒకతల్లి కడుపున పుట్టాలని వెయ్యిదేముళ్ళకి మొక్కుతూ వుంటాను రాధీ! నన్ను నమ్మ'' అన్నాడు మాధవరావు.

''.........''

''రాధీ! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు కానీ, అది సోదరప్రేమ రాధీ!''

''బావా," గాద్గదికంగా అంది అనూరాధ.

''అవును రాధీ! నువ్వుబాగా ఆలోచించుకో. నీది నిర్మలమైన మనస్సు. ఎలాంటి కల్మషం లేనిదానివి. పవిత్రమైన నీ హృదయంలోనుండి వచ్చే మాటలు నాకు అమృతప్రాయమైనవి చెల్లీ'' అన్నాడు మాధవరావు ప్రేమతో రాధతల నిమురుతూ.

''అన్నయ్యా, నన్ను క్షమించు. నీ ప్రేమను అపార్థం చేసుకున్నాను. నన్ను మన్నించు మాధవ్. అన్నయ్య లేని లోటు నాకు తీరింది" అంది రాధ.

ఆమె కనులనుండి నీరు కారి చెక్కిలిమీద జారుతున్నాయి.

మాధవరావు ప్రేమతో ఆమె చెక్కిలిమీదనున్న నీరును తుడిచి ''ఈ సంగతులు ఇప్పుడప్పుడే ఇంట్లో తెలియ నీయకు రాధీ!" అన్నాడు.

మౌనంగా తల ఆడించింది రాధ.

ఆ రాత్రి అంతా ఆలోచనతోనే గడిపింది రాధ. మాధవ్ అన్నదినిజమే. తను బావను ప్రేమించింది. అది సోదరిప్రేమ. చిన్నప్పటినుండి ఒక దగ్గర పెరగడం. తనని, చిన్నప్పటి నుంచీ ఎత్తుకున్న బావ, కలసిమెలసి తిరిగిన బావతో తన వివాహమా? బావను పెంచినవాళ్ళు తన తల్లీ దండ్రీను. తనకు మాధవ్ అన్నలాంటి వాడు అని ఆఖరికి నిశ్చయించుకుంది. 'లలితను క్షమించమని వేడుకోవాలి' అనుకుంటూ నిద్రాదేవి కౌగిలిలో ఒరిగిపోయింది.

మాధవరావు పట్నంనుండి మొదటి సారి గ్రామం వచ్చినప్పుడు జరిగిన సంఘటనలు ఇవి.

*　　*　　*

నెలవలు అయిపోయినాయి. మాధవరావు వెళ్ళిపోయాడు.

తరుచూ అనూరాధకు, లలితకు ఉత్తరాలు వ్రాస్తున్నాడు. ఇదివరకటికన్నా అనూరాధా, లలితలు అత్యంత ప్రియస్నేహితు లయ్యారు.

రోజులు దొర్లిపోయాయి. లలిత జీవితంలో అనుకోని అవాంతరం వచ్చిపడింది. ఏమిటంటే; లలిత తల్లిదండ్రులు లలితకు పెళ్ళిప్రయత్నాలు జరుపుతున్నారు. ఈ సంగతి తెలిసిన లలిత తల్లడిల్లిపోయింది. తను ఇప్పుడప్పుడే పెళ్ళిచేసుకోదలుచుకోలే దని చెప్పింది. ఆమెమాట వినేవా రెవరు? ఒక సంబంధం నిర్ణయించారు. ఈ సంగతి అనూరాధకు చెప్పుకుని యేడ్చింది.అనూరాధ లలితకు ధైర్యం చెప్పి వోదార్చింది. వెంటనే మాధవ రావుపేర ఉత్తరం వ్రాసింది. జావాబు లేదు.

''రాధీ! దేనికైనా అదృష్టం వుండాలి. నేనా అదృష్టానికి నోచుకోలేదు. నాన్న చాల పట్టుదల మనిషి. అవతల పెద్దమనుషులకు మాట ఇచ్చారుట'' అంది లలిత.

"అలా అని నీకు ఇష్టంలేని పెళ్ళి చేసుకుని యేంసుఖపడతావులలితా?" అంది రాధ.

"......."

"నువ్వు బాధపడకు లలితా. ఆ సమయానికి మాధవ్ తప్పకవస్తాడు. నీకు ఈ పెళ్ళి ఇష్టం లేదని చెప్పు. తల్లిదండ్రులుకూడ తమపిల్ల సుఖపడా లనే కదా కోరుకుంటారు. నీ సుఖం వారికి సంతోషం కదూ!''

"అన్నీ చెప్పడం అయాయి రాధీ! నేను బలహీనురాలిని. కన్న తల్లిదండ్రులను యెదిరించే శక్తి నాలోలేదు. నేను నిస్సహాయురాలిని. క్రిందటి జన్మలో యే ప్రేయసీ ప్రియులని విడదీసానో? నిన్ను నీ బావనుండి విడదీయ...."

"ఛ! అవేం మాటలు? మాధవ్ నాకు అన్నలాంటివా డని చెప్పానా!" లలిత మాటను పూర్తికానీయకుండా మధ్యలో అంది రాధ!

లలిత మౌనంగా రెండుచేతులూ ముఖానికి కప్పుకుని రోదించసాగింది. రెండు నిముషాలు వూరుకుని అంది, "మాధవ్ని ఈ జన్మలో భర్తగాపొందే అదృష్టంలేదు. వచ్చే జన్మలోనైనా మాధవ్ని భర్తగా పొంద గలిగేటట్టు చెయ్యమని ప్రార్థిస్తాను రాధీ! మాధవ్వస్తే నన్ను క్షమించమను." అంటూ ఇక అక్కడ నిలువలేక ఒక్క పరుగున ఇంటికి చేరింది లలిత.

అనుకున్న ప్రకారం ముహూర్తం దగ్గరకు వచ్చింది. రేపేపెళ్ళి. మాధవ రావు వస్తాడేమో నని వెయ్యికళ్ళతో ఎదురు చూస్తోంది రాధ. మాధవరావు రాలేదు. రేపన్నది రానే వచ్చింది. ఆ వివాహం తను చూడలేదు. ఒక

సారి లలితకు కనిపించి ఇంటికివచ్చి విచారిస్తూ కూర్చుంది రాధ.

ఆ మర్నాడు తెలిసింది రాధకు పీటలమీదిపెళ్లిఆగిపోయినట్టు.కారణం ఏమి టని తల్లిని అడిగింది. పార్వతమ్మ చెప్పిన సమాధాన మిది, పెళ్ళికుమారుడుకి హఠాత్తుగా గుండెనొప్పి వచ్చి పడిపోయా డని, ఇతనికి ఇలా తరుచు రావడం జరుగుతోం దని తెలిసి లలిత తండ్రి కోపంతో మగపెళ్ళివారిమీద విరుచుకు పడ్డాడు. ఫలితం దెబ్బలాట. తరువాత ఎవరిదారిన వారు వెళ్ళారు. ఆఖరికి తేలిం దేమంటే మూడుముళ్లూ పడలేదు. ఇదీ ఒకందుకు మంచిదే అంది పార్వతమ్మ.

రాధ ఒక్క పరుగున లలితా వాళ్ళింటికి వెళ్ళింది.

లలిత గదిలో కూర్చుని కంటికి మంటికి ఒకేలా ఏడుస్తోంది. ఆ స్థితిలో రాధ లలితను పలుకరించలేక తిరిగి ఇంటికి వచ్చేసింది. తరువాత లలితను కలుసుకో లేకపోయింది. తన అన్న గారింటికి వెళ్ళిం దని తెలిసింది. తనతో మాటమాత్రమైనా చెప్పకుండా వూరు వెళ్ళిం దని బాధపడింది అనూరాధ.

ఒక రోజు అనూరాధ గదిలో కూర్చొని పుస్తకం చదువుతున్నది. ప్రక్కగదిలోనుండి మాటలు వినబడుతున్నయి.

"రాఘువా, రాధమ్మ పెళ్ళిమాట యేం చేశావురా? నేను బ్రతికివుండగా చెయ్యవులా వుంది" అన్నారు దుర్గమ్మ గారు.

"ఏమిటమ్మా యిప్పు డేం తొందర వచ్చింది" అన్నారు రాఘవయ్య గారు.

"అదేవిట్రా అలా అంటున్నావు? పిల్ల ఎదిగి కూర్చుంది; చెట్టంత అల్లుడు వుండనే వున్నాడు. సంబంధాలు వెతకాలా, కట్నాలు పోయాలా! చిన్నప్పటినుంచీ పెంచి పెద్దవాడ్ని చేశావు, పెద్దచదువు చెప్పిస్తున్నావు. నీ కళ్ళఎదుట వాళ్ళు చిలకా గోరింకల్లాగ తిరుగుతూవుంటే సంతోషం కదూ! అయినా మాధవుడు పరాయి వాడు కాదుగా! నీ చెల్లెలుకొడుకు. వాడిదురదృష్టంవల్ల చిన్నప్పుడే తల్లినీ తండ్రినీ పోగొట్టు కున్నాడు. మీరు పెంచినంతమాత్రాన మీ కొడు కు అవుతాడా? నా కళ్ళఎదుటనే ఈ పెళ్ళి జరిపించాలి" అన్నారు దుర్గమ్మ గారు.

ఆవిడ ఉపన్యాసం విన్న రాధకు ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది. 'మామ్మా,' అంటూ కేకవేయబోయి తనలో తానే సముదాయించుకుంది అనూరాధ. మాధవ్ అన్నమాటలు ఒక్కసారి ప్రతిధ్వనించినట్లయింది.

''రాధీ ! వొచ్చేజన్మలోనైనా ఒక తల్లి కడుపున పుడదాం."

ఈ సంగతులు మాధవ్‌కి వ్రాద్దామనుకుంది రాధ. కాని రెండురోజుల క్రితమే తను లలితనుగురించి అన్ని విషయాలూ వ్రాసింది. ఆ ఉత్తరం తనబావ హృదయంలో ఎంత అలజడి లేపిందో ? మళ్ళీ ఈ సంగతులు వ్రాసి అతనిమనస్సు బాధ పెట్టడం ఇష్టంలేక విరమించింది.

ఈ ఆలోచనలతో మామ్మకి నాన్న ఏం సమాధానం చెప్పేరో వినలేదు రాధ.

తరువాత పార్వతమ్మతో అంది రాధ. "అమ్మా, నేను బావను పెళ్ళి చేసుకోను, చేసుకోలేను. నాకు అన్నయ్యలేనిలోటు బావ తీరుస్తున్నాడు. ఇకముందు కూడా అట్లాగే వుంటాము.''

సమాధానంగా పార్వతమ్మ నవ్వి ఊరుకుంది.

ఆ నవ్వువెనక ఏమి సమాధానం ఉందో రాధ గ్రహించలేకపోయింది.

రెండోసారి మాధవరావు తన గ్రామం వచ్చాడు. మాధవ్‌ని చూసి ఆశ్చర్యపోయింది రాధ. మాధవ్‌లో ఎలాంటి మార్పూలేదు. హుషారుగానే వున్నాడు.

"ఏం, రాధీ ! అలా నిర్ఘాంతపడి చూస్తున్నావు ?"

"ఏంలేదు, నువ్వు చాలామారావు" అంది రాధ.

"అవును మారాను. లలితనన్ను మోసంచేసిందని బాధపడ్డాను. ఆ బాధైనా ఆట్టేరోజులు లేదు. ఆరిపోయిన నా హృదయజ్యోతిని సరళ తన చిరునవ్వుతో వెలిగించింది'' అన్నాడు మాధవరావు.

రాధ ఆశ్చర్యంతో అడిగింది. "సరళ ఎవరూ ?"

''నా క్లాసుమేటు రాధీ.''

"నిన్ను నమ్ముకున్న లలితగతి ఏం కావాలనుకున్నావు మాధవ్ ? నేను మొదట వ్రాసిన ఉత్తరం అందలేదా?"

"ఏ ఉత్తరం రాధీ ? లలిత వివాహం ఆగిపోయిందని, అన్నగారి ఊరు వెళ్ళి పోయిందని వ్రాశావు;అది అందింది."

'నిజంగా అందలేదా ? మాధవ్ అబద్ధం చెప్పటంలేదు కదా ?' అనుకుంది మనస్సులో రాధ.

వారంరోజులయిన తరువాత మాధవరావు సరళఫోటోను చూపించి ''ఏలా వుంది ?'' అని అడిగాడు.

రాధ ఆ ఫోటోను పరీక్షగా చూసి ''అందమైనది; నీకు తగినది" అంది.

''రాధీ ! నువ్వు బాధపడుతున్నావు ?'' అన్నాడు మాధవరావు.

''ఎందుకు ? లేదన్నయ్యా ! నాకు బాధఎందుకు" తడబడుతూ అంది రాధ.

నిముషం అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నారు రాఘవయ్యగారు.

"అయితే నే విన్నది నిజమే నన్న మాట."

"ఏమిటి?" దుర్గమ్మ, పార్వతమ్మలు ఇద్దరూ ఒక్కసారిగా అన్నారు.

"ఆ ఏముందీ. ఓ రెండుజడలమ్మాయిని వెంట వేసుకుని తిరుగుతున్నాడని...."

"మామయ్యా."

"ఏం. నువ్వక్కడ యెన్ని వేషాలు వేస్తున్నావో నాకు తెలీ దనుకుంటున్నావు కాబోలు. ఈ గ్రామం కదిలి ఎలా వెళతావో చూస్తాను. ముహుర్తం నిశ్చయించాను 'పదిహేను రోజులే వ్యవధి వుంది,' బాగా ఆలోచించుకో! అయినా నీ ఆలోచనలతో నాకు సంబంధం లేదు" అన్నారు తీవ్రంగా రాఘవయ్యగారు.

"మాధవా? రాధ పుట్టగానే నీ పెళ్ళామనుకున్నాము రా? మామయ్యని నలుగురిలో తల యెత్త నీయరా! నీకు అదెక్కడ దొరికిందిరా తండ్రీ" అంటూ వాపోయారు దుర్గమ్మగారు.

పార్వతమ్మ ఏమీ మాట్లాడలేదు.

"మాధవా! చిన్నప్పటినుండీ నిన్ను పెంచి పెద్దవాడ్ని చేశాము. పెద్ద చదువు చెప్పించాము. నువ్వు నా అల్లుడవని అందరికీ తెలుసు. రాధ నీ భార్య. ఇద్దరూ నాకళ్ళెదుటే వుంటారని భావించాను" రుద్ధకంఠంతో అన్నారు రాఘవయ్యగారు.

"మామయ్యా! నన్ను చిన్నప్పటి నుండీ పెంచి పెద్దవాడిని చేసేరు. ఎన్ని జన్మ లెత్తినా మీ రుణం తీర్చుకోలేను. తల్లితండ్రి లేని నన్ను కన్నకొడుకు కన్నా ఎక్కువగా చూసుకున్నారు. రాధీ నాకు చెల్లెలువంటిది. మా ఇద్దరి హృదయాలలో సోదర సోదరీ ప్రేమతప్ప మరే భావాలులేవు. నన్ను క్షమించండి" అన్నాడు మాధవరావు.

అంతవరకు గదిలో కూర్చుని వారి మాటలు వింటున్న రాధ లేచివచ్చింది.

రాధను చూసి అన్నారు దుర్గమ్మగారు: "విన్నావా రాధా! నీ బావ మాటలు"

"నిజమే మామ్మా! మాధవ్ నా అన్నయ్యలాంటివాడు" అని తల్లి దగ్గరకి వెళ్ళి "అమ్మా, నాన్నగారికి నువ్వు నచ్చచెప్పు. నేను పుట్టకముందు మాధవ్‌ని కన్నకొడుకుగా చూచుకొని నేను పుట్టగానే మీ అభిప్రాయం మార్చుకోవడం యేమీ సబబుగాలేదు. నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు" అని నిర్భయంగా చెప్పింది రాధ.

"నాకు ఎవరూ నచ్చచెప్ప నవసరం

లేదు. మీ వివాహం ఎందుకు జరగదో నేను చూస్తాను'' అన్నారు కోపంగా రాఘవయ్యగారు

''ఈ వివాహం జరగడానికి వీల్లేదు'' దాదాపు గట్టిగా అరచినంతగా అన్నాడు మాధవరావు.

''ఎలా వీలుండదో నేను చూస్తా ?'' కోపంగా లేచి నిలబడ్డారు రాఘయ్యగారు.

''నాన్నగారూ ! మీరు మాధవ్‌ని అర్థం చేసుకోండీ'' అంది రాధ.

''ఆ, నిన్నూ అర్థం చేసుకున్నాను'' కోపంగా అని వెళ్ళిపోయి మరల వెనక్కివచ్చి గట్టిగా అన్నారు రాఘవయ్యగారు :

''మాధవ్! నీ ఉద్దేశం అదే అయితే తక్షణం నా ఇంట్లోనుంచి వెళ్ళిపో, నీ ముఖం నాకు చూపించవద్దు." ఎవరి సమాధానం వినకుండా చరచరా వీధిలోకి వెళ్ళిపోయారు.

మాధవరావుకు దుర్గమ్మగారు, పార్వతమ్మకూడ శతవిధా నచ్చచెప్ప బోయారు. మాధవరావు నోటినుండి ఒకటే మాట.

''రాధీని నా చెల్లెలుగా నే ప్రేమిస్తున్నా'' నని.

ఆ మర్నాడు ప్రొద్దుట మాధవరావు ఎవరికీ కనుపించలేదు. కనీసం రాధతో కూడా చెప్పకుండా వెళ్ళినందుకు చాల బాధపడింది.

ఆ ముహూర్తానికే రాధకు చక్కని యువకునితో వివాహం స్థిరపరిచారు రాఘవయ్యగారు. మగపెళ్ళివారు తమంతట తామేవచ్చి అడిగారు. 'సరే' అనక తప్పలేదు రాఘవయ్యగారికి. ''మాధవ్ లేకుండా తన వివాహమా?" రాధమనసు తల్లడిల్లిపోయింది. పెళ్ళి నాలుగురోజులుండగానే ఊడిపడ్డాడు, మాధవరావు. ''అన్నయ్యా'' అంటూ వచ్చి మాధవ్‌ని చుట్టేసింది రాధ, ''రాధీ ! నేను రానను కున్నావా ? వెర్రిపిల్లా ! మీ అన్నయ్య దగ్గరుండే, నీ పెళ్ళి జరిపిస్తాడమ్మా !'' ప్రేమతో రాధతల నిమురుతూ అన్నాడు మాధవరావు.

ఈ దృశ్యం చూసిన రాఘవయ్యగారు ''మాధవ్ ! చెల్లెలితోమాట్లాడు కుంటూ కూచోవడం కాదు, వెళ్ళి స్నానం అదీ కానీ. అవతల చాలపను లున్నాయి" అంటూ కళ్ళుతుడుచు కుని అక్కడినుండి నిష్క్రమించారు. ''బాబూ'' అంటూ పార్వతమ్మ మాధవ్‌ని అక్కున చేర్చుకున్నారు. మాధవా ! అంటూ దగ్గరకు తీసు కున్నారు దుర్గమ్మగారు.

అనూరాధ వివాహం అయి పోయింది. తను అత్తగారి వూరు వెళుతూ మళ్ళీ నీ పెళ్ళికే రావడం అంది మాధవునితో. ''నా వివాహం ఇప్పుడప్పుడే కాదు. ఉద్యోగం దొర



కాలి; వివాహం చేసుకోవాలి "ఈలోగా ఇక్కడికి ఒకసారి రావచ్చును" అన్నాడు నవ్వుతూ మాధవ్. అంతా నవ్వుకున్నారు.

*　　*　　*

ఆనూరాధ మెల్లిగా కనులు తెరిచింది. ఆమెకన్నులనుండి చెక్కిలిమీద పడుతున్న కన్నీటిని తుడుచుకుంది.

అవి కన్నీళ్ళుకావు; ఆనంద భాష్పాలు.

నున్నటి తారురోడ్డుమీద జెర్రిపోతులా దొర్లుతూ వెళుతూందికారు.

"ఏం. అనూ; ప్రయాణం సుఖంగా వుందా ?" పశ్నించాడు స్టీరింగు పట్టుకున్న వ్యక్తి.

"ఆహా, బాగానేవుంది ప్రయాణం. విజయవాడలో మాధవ్, లలిత కనుపించారు." చుచాయగా వారి విషయాలు భర్తకు చెప్పింది అనూరాధ

"మరి సరళ ఏమైనట్టు ?" ప్రశ్నించాడు అనూరాధ భర్త.

"ఈ సందేహమే నాకూ కలిగింది. నేను అడగకుండానే అన్నిసంగతులు ఉత్తరం వ్రాస్తానన్నది లలిత" అంది అనూరాధ.

"మీ వాళ్ళ గొడవల్లో పడి మావాళ్ళసంగతి చెప్పావు కావు" అన్నాడు, ఒకచెయ్యి అనురాధ భుజం మీద వేసి, ఆమెభర్త.

"ఏముంది అత్తయ్య, మామగారు కులాసాగా వున్నారు. శశిని వుంచ

మన్నారు. వుం చేసాను" అంది నవ్వుతూ.

"ఆ సంగతినువ్వుదిగుతూవుంటేనే గ్రహించాను. పాప నిన్ను వదిలి వుంటుందా ?"

"వుంటుందిలెండి. అక్కడ బాగా చేరిక అయింది" అంది రాధ. కారు ఓ చిన్న బంగళాముందు ఆగింది.

ఆనంద్ పెద్ద ఉద్యోగస్తుడు; అనూ రాధ అతనిభార్య.

వారికి శశీ, బాబు ఆణిముత్యా ల్లాంటి బిడ్డలు. ఈ మధ్యనే చక్కటి ఇల్లు కట్టుకుని చిన్నకారు కొనుక్కు న్నారు. ఆనంద్ తల్లికి సుస్తీ చేస్తే భార్యాసమేతంగా మద్రాసు వెళ్ళేడు. తను ఓ పదిహేనురోజు లుండి భార్యను పిల్లలను అక్కడ వుంచి తనుమాత్రం వచ్చేశాడు. రెండు నెలలు అత్తగారికి సేవచేసింది. అత్తగారి వంట్లో కులా సాగా వున్నతరువాత బయల్దేరింది. శశిని వుంచమన్నారు. శశికూడా వుంటా నని అల్లరి చేయడంమూలాన వదిలివచ్చింది అనూరాధ.

అనూరాధ వచ్చినవెంటనే లలితకు ఉత్తరం వ్రాసింది కులాసాగా చేరినట్టు. నాలుగురోజు లయినతరువాత లలిత దగ్గరనుండి పెద్ద వుత్తరం వచ్చింది అనూరాధకు. అత్రుతతో విప్పి చదవ సాగింది అనూరాధ.

"రాధీ! ఆ రోజు నీతోకూడా చెప్ప కుండా అన్నయ్యవెంట బయలుదేరి వచ్చేశాను. వొదిన చాలా మంచిది. నాకు జరిగిన అన్యాయం విని బాధ పడ్డది. అసలు ఈ సంబంధం వొద్దని అన్నయ్య నాన్నకు వ్రాసేడుట. పాపం, నాన్నకైనా ఏం తెలుసు చెప్పు ? ఏదో కలలో జరిగిపోయినట్టు జరిగింది. అంతా మర్చిపోయాను గాని మాధవ్‌ని మర్చిపోలేక పోయేను. మాధవ్ కూడ ఇక్కడ వుంటున్నాడు కదా ? ఎప్పుడు ఎక్కడ తటస్థ పడ తాడో అని భయపడేదాన్ని. కాని అప్పుడప్పుడు మాత్రం మాధవ్ ని చూడా లనీ క్షమించ మని వేడుకోవా లనీ అనుకొనేదాన్ని. ఒకసారి హఠా త్తుగా కనుపించాడు మాధవ్. ఒంటిగా కాదు జంటగా. మాధవ్ వెనకాల అందమైన అమ్మాయిని చూసి క్షణ కాలం అలా నిలబడి పోయాను. మాధవ్ నన్ను చూడలేదు. నాకు కావలసినది అదే ! ఇంటి కొచ్చిన తరువాత ఆలోచిస్తూ ఆ రాత్రి అంతా గడిపివేసేను. ఆ అందమైన అమ్మాయి ఎవరన్న ప్రశ్న నాలో కలిగింది. ఎందుకో చాల బాధపడ్డాను, రాధీ ! ఆ రోజు నువ్వెంత బాధపడివుంటావో అప్పుడు తెలుసుకున్నాను. కానీ రాధీ! నీలా నేను త్యాగం చెయ్యలేక పోయాను. నేనెంత స్వార్ధపరురాలిని? నా వెర్రిగాని మాధవ్ నావా డెలా

అవుతాడు ? కావా అని నాకు నేనుగా వస్తున్న అదృష్టాన్ని జారవిడుచుకున్నాను. రాధీ ! నీకు గుర్తుందా నువ్వు మాధవ్‌కి ఉత్తరం వ్రాశావు లలిత వివాహం స్థిరపరుస్తున్నారు. నిన్నే నమ్ముకుంది లలిత.ఉత్తరం అందగానే బయలుదేరి రమ్మని వ్రాశావు" కాని ఆ ఉత్తరం మాధవ్‌కి చేరలేదు. పనిమనిషి దగ్గరనుండి నేను తీసుకున్నాను. నీతో చెప్పవద్దని దానికి కొంత ముట్టజెప్పానుకూడా. నాన్న సంబంధం స్థిరపరచారు. అవతలవారికి మాట ఇచ్చినతరువాత హఠాత్తుగా పెళ్ళి ఆగిపోతే, ఎంత తలవంపు, నాన్నకి ఎంత అప్రతిష్ట అనుకుని ఆ ఉత్తరంచదివిచింపివేశాను.కాని పెళ్ళి ఆగనూ ఆగింది; నాన్నకూడా బాధపడ్డాడు జరిగిన అవమానానికి. ఆరోజు ఎంతో ఏడ్చాను. రెండేళ్ళు గడిచాయి. ఒకరోజు అన్నయ్య కారుకింద ఎవరో మనిషి పడ్డాడని అతన్ని అన్నయ్యఆసుపత్రికి తీసుకెళ్ళి కట్లుకట్టించి ఇంటికి తీసుకువచ్చాడని పనివాడు చెప్పేడు. నేను అన్నయ్యగదిలోకి వెళ్లేను. అక్కడ మంచంమీద ముఖంనిండా కట్లతో పడుకునివున్నాడు మాధవ్. మాధవ్' అని కేకేసి పడిపోయాను. తెలివి వచ్చేసరికి వొదిన దగ్గరుంది. ఏమయిందమ్మా' అని అన్నయ్య ఆతృత్తో అడుగుతున్నాడు. ఇక ఏమీ దాచకఅంతాచెప్పేశాను. వొదిన బాధపడింది. అన్నయ్య మౌనంగా విని వూరుకున్నాడు. వారంరోజులకి మాధవ్ కోలుకున్నాడు. దగ్గరుండి నేనే సేవచేసేను, తరువాత మాధవ్ చెప్పేడు సరళని వివాహం చేసుకున్నట్టు, మశూచికం వచ్చి చనిపోయిందని వాపోయాడు. కొన్నాళ్ళకి ఆయన భార్యనయ్యాను. రాధీ! ఇప్పుడు ఆయన హృదయంలో నాకొక్కదానికే స్థానం. నేను అదృష్టవంతురాలిని కదూ ! రాధీ ! నీకు చెప్పడం మర్చాను. కాదు ఇద్దరం మర్చిపోయాము. మా ఇంట్లో ఓరాధీ వుంది తెలుసా? ఆ రోజు స్కూలుకు వెళ్ళిపోయింది. మా అనూరాధకు ఎనిమిదేళ్ళు. ఆ రాధీ, 'సరళపాప' మా బాబూ నిద్రపోతున్నారని స్టేషనుకు తీసుకురాలేదు. ఈ సంగతులు చెప్పడానికి వ్యవధి లేకపోయింది. మరి వుంటాను.

నీ లలిత."

ఉత్తరంచదివి అక్కడే కూర్చున్న భర్తఆనంద్‌కి అందించింది అనూరాధ.

లలిత వ్రాసిన ఉత్తరాన్ని చదివి "బాగుంది. లలితజీవితం బాగుపడింది. నీకుకావలసిందికూడ అదే"అన్నాడు.

అనూరాధ మౌనంగా ఆకాశం వైపుగా అట్లా చూస్తూ కూర్చుండిపోయింది. ★